సాక్షి
జోగులాంబ గద్వాల

బుధవారం, 15, అక్టోబర్, 2025



నీటినిల్వకు అడుగులు

కృష్ణా మండలంలో కృష్ణానదిపై ఉన్న పాత వంతెనకు పెట్టర్లు ఏర్పాటు చేసి నీటినిల్వకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

-IIలో ▸



ఉత్సాహంగా ఆర్చరీ ఎంపికలు

పాలమూరు ప్రధాన స్టేడియంలో మంగళవారం ఎస్జీఎఫ్ అండర్-14, అండర్-17 ఉమ్మడి జిల్లా ఆర్చరీ ఎంపికలు నిర్వహించారు.

-IIలో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.1 /21.4

మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత కనిపిస్తుంది. రాత్రిళ్లు చలిగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను డీఎంఎల్‌టీ, డీఈసీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.మహబూబ్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ ఉత్తీర్ణులై తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుందన్నారు. బైపీసీ అభ్యర్థులు అందుబాటులో లేనిపక్షంలో ఇతర గ్రూపుల అభ్యర్థులను సైతం పరిగణనలోకి తీసుకుంటారన్నారు. ప్రభుత్వ సంస్థ ప్రిన్సిపాల్ ద్వారా ఎంపిక విధానం ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు tgpmh.telangana.gov.in వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల జిరాక్స్ దరఖాస్తు ఫారానికి జతచేసి సంబంధిత అధికారికి ఈ నెల 28వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

గట్టు: రైతులు ఆధునిక పద్ధతులు అనుసరించి అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జగ్గునాయక్ సూచించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం గొర్లఖాన్‌దొడ్డి రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటల సాగులో అవసరానికి మించి ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడొద్దని రైతులకు సూచించారు. తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అనంతరం పత్తి విక్రయానికి సంబంధించి రైతులు కాపస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకం కింద వంద శాతం రాయితీపై వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, ఎఫ్‌పీఓ డైరెక్టర్ తిమ్మప్ప పాల్గొన్నారు.

అభివృద్ధి పట్టని పాలకులు



రాజోళి: గ్రామీణ ప్రాంత రోడ్లు గుంతలమయంగా మారినా పాలకులు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.వెంకటస్వామి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి అన్నారు. ఈ మేరకు మంగళవారం రాజోళి–శాంతినగర్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజోళి నుంచి 3 కి.మీ. దూరంలోని శాంతినగర్‌కు వెళ్లేందుకు 30 నిమిషాలకు పైగా సమయం పడుతుందన్నారు. గుంతల రోడ్డుపై ఎంతో మంది కిందపడి గాయపడినా ఎవరికీ పట్టడం లేదని వాపోయారు. ఈ రోడ్డును బాగుచేయాలని కొన్నేళ్లుగా పాలకులు, అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం అంటూ ప్రగల్భాలు పలికే నాయకులు ఈ రోడ్డుపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. వెంటనే రోడ్డుకు మరమ్మతు చేయించాలని డిమాండ్ చేశారు. కాగా, విషయం తెలుసుకున్న రాజోళి తహసీల్దార్ రామ్మోహన్ అక్కడికి చేరుకుని రెండు రోజుల్లో మరమ్మతు చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, మండల కార్యదర్శి విజయ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్, గోపాల్‌రెడ్డి, జయన్న, గోకారి, రాజు, మహేశ్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యం నిర్దేశించుకోవాలి



గద్వాలటౌన్: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యం నిర్దేశించుకొని ముందుకుసాగాలని డీఈఓ విజయలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో మంగళవారం ఎస్‌ఈఆర్‌టీ ఆధ్వర్యంలో జనాభా విద్యా విభాగం వారిచే రోల్ ప్లే కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నెట్ వినియోగంపై పోటీలు నిర్వహించగా.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. అత్యుత్తమ ప్రతిభకనబర్చిన అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుపొందారు. ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ, మోహిన్‌మహిల్లా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు డీఈఓ విజయలక్ష్మి మెమోంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ అధికారిణి ఎస్తేరు రాణి తదితరులు పాల్గొన్నారు.

తేలని ఇసుక పంచాయితీ

కాంట్రాక్టర్‌తో 'అధికార' సన్నిహితుల బేరసారాలు



తుంగభద్ర నది ఇసుక రీచ్ వద్ద నిలిచిన వాహనాలు

- కప్పం కట్టేందుకు అంగీకరించని కాంట్రాక్టర్
- మౌనం వీడని అధికారులు
- ఇసుక లభించక ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో అసహనం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక సరఫరా కోసం 'మన ఇసుక వాహనం' ద్వారా చేపట్టిన కార్యక్రమానికి అడ్డంకులు తొలగడం లేదు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం పరిధిలోని తుమ్మిళ్లలో తుంగభద్ర నది నుంచి ఇసుకను సేకరించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సరఫరా చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇటీవల తవ్వకాలను ప్రారంభించారు. అయితే అలంపూర్ నియోజకవర్గానికి చెందిన ఓ అధికార పార్టీ నేత ఒత్తిళ్లతో ఇసుక తవ్వకాలు, రవాణా నిలిచిపోగా.. దుమారం చెలరేగింది. ఇసుక రవాణా కొనసాగాలంటే సంబంధిత కాంట్రాక్టర్ ఒక్కో టిప్పర్‌కు రూ.6 వేల చొప్పున కప్పం చెల్లించాలని హుకుం జారీ చేయగా.. కాంట్రాక్టర్ ససేమిరా అనడంతో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఇసుక రవాణా నిలిచిపోవడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఈ వివాదాన్ని సద్దుమణిగించేందుకు అధికార పార్టీకి చెందిన సన్నిహితులు రంగంలోకి దిగినట్లు తెలిసింది.

ఎవరి పట్టు వారిదే..

తుమ్మిళ్ల నుంచి ఇసుక బయటకు రావాలంటే ఒక్కో ట్రిప్పర్‌కు రూ. 6 వేల చొప్పున ఎట్టి పరిస్థితుల్లోనైనా చెల్లించాల్సిందేనని అధికార నేత పట్టుబట్టినట్లు సమాచారం. దీనిపై మంగళవారం సైతం అధికార నేతకు చెందిన సన్నిహితులు.. కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపినట్లు సమాచారం. బేరసారాలు జరిగినా సఫలం కానట్లు తెలిసింది. సదరు నేతకు కప్పం చెల్లించేందుకు సంబంధిత కాంట్రాక్టర్ ఒప్పుకోనట్లు తెలుస్తోంది. ఒక్క రూపాయి ఇచ్చేది లేదంటూ ఆయన భీష్మించుకొని కూర్చున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇసుక రవాణాకు మరింత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అధికారుల మౌనంపై విమర్శలు..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం తుంగభద్ర నుంచి ఇసుక తవ్వకాలను ప్రారంభించి 45 రోజులు గడుస్తున్నా.. ఇంకా కొలిక్కి రాకపోవడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మౌనం వీడకపోవడం.. సకాలంలో ఇసుక అందేలా చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు ధరకు పత్తి కొనుగోలు



కనీస మద్దతు ధరల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: రైతులు పండించిన పత్తికి ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో కనీస మద్దతు ధరల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు పత్తిని విక్రయించే ముందు కాపస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. 2025–26 సీజన్‌లో బీబీ మోడ్ పత్తి రకానికి రూ. 8,110, బీబీ ఎస్‌పీఎల్ రకానికి రూ. 8,060, మెక్ రకానికి రూ. 8,010 మద్దతు ధరలు కల్పిస్తున్నట్లు వివరించారు. కాపస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ సందర్భంగా వచ్చే ఓటీపీ కోసం ఆధార్ లింక్ ఉన్న మొబైల్ వినియోగించాలని తెలిపారు. బ్యాంక్ ఖాతాను ఆధార్‌తో లింక్ చేయించుకోవాలన్నారు. అదే విధంగా పత్తిలో తేమ 8–12శాతం మించరాదన్నారు. జిల్లాలో పత్తి సేకరణ కోసం హరిత కాటన్ మిల్లు, బాలాజీ కాటన్ జిన్నింగ్ మిల్లు, శ్రీవరసిద్ధి వినాయక కాటన్ మిల్లులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 27 నుంచి పత్తి కొనుగోలు ప్రారంభిస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 18005995779 లేదా 88972 81111 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, కార్యదర్శి నర్సింహ, ఎల్లస్వామి పాల్గొన్నారు.

- తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్–2047 డాక్యుమెంట్‌ను రూపొందిస్తుందని కలెక్టర్ అన్నారు. ఈ సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులందరూ పాల్గొనాలని సూచించారు.

- బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, వారి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు ఉన్నారు.

కేసుల నమోదులో జాప్యం వద్దు : ఎస్పీ



పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: వివిధ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం డీఎస్పీ మొగిలయ్యతో కలిసి ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించడంతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. బాధితుల ఫిర్యాదులపై వేగంగా విచారణ చేపట్టి.. పోలీసుశాఖపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని సూచించారు. కేసుల నమోదులో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చేయొద్దన్నారు. చోరీలను అరికట్టేందుకు నిత్యం కాలనీల్లో గస్తీ, పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. సైబర్ క్రైం, మహిళల వేధింపులు, లైంగిక దాడులు, మిస్సింగ్ కేసులపై ప్రత్యేక నిఘా ఉంచి తగు చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యం వాహనాల తనిఖీతో పాటు డ్రంకెన్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం లంచం

- ఏసీబీకి చిక్కిన లైన్‌మన్ నాగేందర్
- రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



ఏసీబీకి చిక్కిన లైన్‌మన్ నాగేందర్

వంగూరు: మితిమీరిన అవినీతికి పాల్పడుతూ రైతులను, విద్యుత్ వినియోగదారులను పీల్చిపిప్పి చేస్తున్న విద్యుత్ శాఖ లైన్‌మన్ నాగేందర్ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని మాచినోనిపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు ట్రాన్స్‌ఫార్మర్ కావాలని నాలుగు నెలల క్రితం నాలుగు డీడీలకు డబ్బులు చెల్లించాడు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ బిగించడంలో లైన్‌మన్ నాగేందర్ నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. నిత్యం ట్రాన్స్‌ఫార్మర్ కోసం లైన్‌మన్‌ను కలవగా నాలుగు డీడీలకు రూ.20 వేలు అయినప్పటికీ అదనంగా రూ.10 వేలు తీసుకున్న లైన్‌మన్ సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వకుండా మరో రూ.20 వేలు డిమాండ్ చేశాడు. దీంతో బాధిత రైతు ఏసీబీ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు వంగూరు గ్రామ శివారులోని మద్యం దుకాణం ఎదుట రైతు రూ.15 వేల నగదునాగేందర్‌కు ఇస్తుండగా సమీపంలో ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకుని విద్యుత్ కార్యాలయానికి తరలించారు. నాగేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టుకు తరలిస్తామని పేర్కొన్నారు. దాడుల్లో ఏసీబీ సీఐలు లింగస్వామి, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలను నమోదు చేయించుకోవాలి

గద్వాల: జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధుల సొసైటీలను అధికారికంగా నమోదు చేయించుకోవాలని డీడబ్ల్యూఓ సునంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సంఘాల రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు కార్యవర్గ సభ్యులు, ఇతర సభ్యుల జాబితా తదితర వివరాలను ఈ నెల 18వ తేదీలోగా ఐడీఓసీలోని జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అధికారికంగా నమోదు చేసుకున్న సొసైటీలకు ప్రభుత్వం వివిధ సందర్భాల్లో నిర్వహించే సమన్వయ సమావేశాలు, ఇతర కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కమనీయం.. రాములోరి కల్యాణం



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: శ్రీరాముడి జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం బీచుపల్లి క్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సీతారాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి.. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం జరిపించారు. భక్తులు సీతారాముల కల్యాణాన్ని కనులారా తిలకించి తన్మయం పొందారు. అనంతరం ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, అర్చకులు భువనచంద్ర, దత్తుస్వామి, భానుమూర్తి పాల్గొన్నారు.

కొనసాగుతున్న మద్యం టెండర్ల దాఖలు



జిల్లాల వారీగా దాఖలైన టెండర్లు ఇలా..

జిల్లా	మంగళవారం వచ్చినవి	మొత్తం టెండర్లు
మహబూబ్‌నగర్	18	186
జోగుళాంబ గద్వాల	18	111
నాగర్‌కర్నూల్	2	107
నారాయణపేట	5	57
వనపర్తి	10	47

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలకు టెండర్ల స్వీకరణ కొనసాగుతుంది. మొత్తం 227 ఏ4 దుకాణాలకు గాను గత నెల 26 నుంచి దరఖాస్తులు తీసుకోవడం ప్రారంభించగా.. ఇప్పటి వరకు 508 టెండర్లు వచ్చాయి. ఇందులో మంగళవారం 53 దరఖాస్తులు వచ్చాయి. కాగా.. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.15.24 కోట్ల ఆదాయం సమకూరింది. మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి భారీ మొత్తంలో టెండర్లు వేయడానికి ప్రణాళికలు జరుగుతున్నాయి. ఇప్పటికే స్వల్పంగా వేసిన వ్యాపారులు రాబోయే మూడు రోజుల్లో భారీగా వేయడానికి సిద్ధపడుతున్నారు. అదేవిధంగా ఆంధ్ర వ్యాపారులు సైతం స్థానికులతో కలిసి టెండర్లు వేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

23న లక్కీ డ్రా

గద్వాల: జిల్లాలోని 34 మద్యం దుకాణాలకు ఈ నెల 23న లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా 2025–27 సంవత్సరానికి గాను నోటిఫికేషన్ విడుదలచేసి.. సెప్టెంబర్ 26 నుంచి ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా 23న ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో లక్కీ డ్రా ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేరుశనగ క్వింటాల్ రూ.4,689

గద్వాల వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు మంగళవారం 116 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి వచ్చింది. క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 4,689, కనిష్టంగా రూ. 3,459, సరాసరి రూ. 4,310 ధరలు వచ్చాయి. అదే విధంగా 137 క్వింటాళ్ల ఆముదాలు అమ్మకానికి రాగా.. గరిష్టంగా రూ. 5,911 కనిష్టంగా రూ. 4,359, సరాసరి రూ. 5,579 ధరలు లభించాయి.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యం



గద్వాలటౌన్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని ఇన్‌చార్జి డీవైఎస్‌ఓ కృష్ణయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో అండర్–14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో గెలుపోటముల కంటే క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడం ప్రధానమని అన్నారు. క్రీడలతో పట్టుదల, శ్రద్ధ అలవడుతాయన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను జోనల్, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటలకు అందలం



పీయూలోని సింథటిక్ ట్రాక్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

- పీయూలో క్రీడలకు ప్రాధాన్యమిస్తున్న అధికారులు
- సింథటిక్ ట్రాక్ నిర్మాణంతో అథ్లెటిక్స్‌కు అనేక అవకాశాలు
- ఇండోర్ స్టేడియం, బాస్కెట్ బాల్ కోర్టు నిర్మాణంతో ప్రయోజనం
- ప్రస్తుతం కొనసాగుతున్న పలు ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికలు
- సౌత్‌జోన్‌లో 1,050, ఆలిండియా పోటీల్లో పాల్గొన్న 350 మంది విద్యార్థులు



మరో 2 రోజులు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని పలు డిగ్రీ, పీజీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. క్రీడల్లో మక్కువ ఉండి పీయూలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఇక్కడ ఉండే క్రీడా వసతులతో ఎంతో ప్రయోజనం పొందనున్నారు. ప్రతి సంవత్సరం సౌత్ జోన్, ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. అంతేకాకుండా జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు వచ్చే సర్టిఫికెట్‌తో స్పోర్ట్స్ కోటా సైతం లభించనుంది. దీంతో చాలామంది విద్యార్థులు క్రీడలపై ఆసక్తి కనబరుస్తున్నారు.

వరంగా వసతులు..

హైదరాబాద్ తర్వాత సింథటిక్ ట్రాక్ ఉన్న ఏకైక జిల్లాగా పాలమూరు ఖ్యాతి గడించింది. ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో 400 మీటర్ల ట్రాక్‌తో పాటు 100 నుంచి 1500 మీటర్ల వరకు వివిధ స్థాయి క్రీడలు నిర్వహించవచ్చు. ఫీల్డ్ ఈవెంట్స్‌లో హైజంప్, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, పోల్‌వాల్ట్‌తో పాటు ఒక ఫుట్‌బాల్ గ్రౌండ్ కూడా నిర్మించారు. సుమారు 2 వేల మంది జనాలు కూర్చొని క్రీడలను వీక్షించేందుకు వీలుగా గ్యాలరీ సైతం ఏర్పాటు చేస్తున్నారు. వీటితోపాటు ఇండోర్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్, షటిల్, చెస్, క్యారమ్స్‌తోపాటు జిమ్ కూడా అందులో అందుబాటులో ఉంది. దీంతో విద్యార్థుల ఫిట్‌నెస్ కోసం ఎంతో ఉపయోగపడనుంది.

జాతీయ క్రీడల్లో ప్రాతినిధ్యం..

పీయూ నుంచి ప్రాతినిధ్యం వహించి జాతీయ స్థాయి పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. హారికాదేవి 2018లో ఆలిండియా స్థాయి అథ్లెటిక్స్ 100 మీటర్లలో మూడో స్థానంలో నిలిచింది. 2019లో మహేశ్వరి స్టీపుల్ చేజ్‌తో ఆలిండియా రెండో స్థానం సాధించింది. 2020లో హారికాదేవి ఆలిండియా అథ్లెటిక్స్ 200 మీటర్లలో 2వ స్థానం, ఆలిండియా 100 మీటర్లలో 2వ స్థానంలో నిలిచింది. 2020లో మహేశ్వరి ఖేలో ఇండియాలో 3000 మీటర్ల స్టీపుల్ చేజ్‌లో 2వ స్థానం, 2020లో హారికాదేవి ఖేలో ఇండియాలో 100 మీటర్ల అథ్లెటిక్స్‌లో 4వ స్థానంలో నిలిచారు. విష్ణువర్ధన్ గత నాలుగు సంవత్సరాలు జాతీయ స్థాయి ఆర్చరీలో వివిధ స్థాయిల్లో ప్రాతినిధ్యం వహించారు. డేవిడ్ కృపాల్‌రే గత నాలుగేళ్లు ఎస్‌జీఎఫ్ఐ క్రికెట్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభచాటారు. 2024లో భరత్ ఆర్చరీలో ఆలిండియా స్థాయిలో సత్తాచాటారు. మొత్తంగా ఇప్పటి వరకు పీయూ తరఫున సౌత్‌జోన్ పోటీల్లో 1,050, ఆలిండియా పోటీల్లో 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



పీయూలో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా అన్ని సదుపాయాలు ఉన్నాయి. సింథటిక్ ట్రాక్, ఇండోర్ స్టేడియం వంటివి ఉండటం జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనే వారికి ఎంతో ప్రయోజనకరం. పోటీల్లో పాల్గొనే వారికి శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రతిభచాటిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. పీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు సౌత్‌జోన్, ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఎంపికయ్యే విధంగా ప్రోత్సహిస్తున్నాం. జాతీయ స్థాయి క్రీడాల్లో పాల్గొన్న వారికి ఇచ్చే సర్టిఫికెట్‌లతో ఉద్యోగాల్లో రిజర్వేషన్ సైతం పొందేందుకు ఆస్కారం ఉంటుంది.

– శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్, పీయూ

క్లుప్తంగా

జూదానికి బానిసై యువకుడి ఆత్మహత్య

వంగూరు: జూదానికి బానిసై సర్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాలు.. తెల్కపల్లి మండలం గౌరారానికి చెందిన నవీన్(27) హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, తాగుడుకు బానిసై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారు జామున శ్రీశైలం క్రాస్‌రోడ్డు వద్దకు ఆటోలో వెళ్లి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, పది నెలల బాబు ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శ్రీనివాసులు(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తెల్కపల్లి మండలం గడ్డంపల్లికి చెందిన కాకనూరి శ్రీనివాసులు (55) తన బైక్‌పై బిజినేపల్లి మండలం ఖానాపూర్‌లో బంధువుల చావుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. ఉయ్యాలవాడ వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై కత్తితో దాడి

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ స్టేజీ వద్ద అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎండీ సలీంపై హైదరాబాద్‌కు చెందిన రిషిప్రణయ్, విజయ్ కత్తితో దాడి చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. అచ్చంపేట డిపోకు చెందిన బస్సు హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు వెళ్తున్న సమయంలో వెల్దండ నుంచి హైదరాబాద్‌కు స్కూటీపై వెళ్తున్న ప్రణయ్, విజయ్ పెద్దాపూర్ సమీపంలో బస్సుకు అడ్డు వచ్చారు. దీంతో డ్రైవర్ వారిని మందలించారు. పెద్దాపూర్ స్టేజీ వద్ద ప్రయాణికులను దించేందుకు డ్రైవర్ బస్సును నిలిపాడు. స్కూటీపై ఉన్న ప్రణయ్ తన వద్ద ఉన్న కత్తితో ఆర్టీసీ డ్రైవర్ సలీంపై దాడి చేసి చేతిని గాయపరిచారు. అప్రమత్తమైన ప్రయాణికులు పారిపోతున్న రిషిప్రణయ్, విజయ్‌ను పట్టుకున్నారు. అనంతరం నిందితులను వెల్దండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఆర్చరీ ఎంపికలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17 విభాగాల బాలబాలికల ఉమ్మడి జిల్లా ఆర్చరీ ఎంపికలు నిర్వహించారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి ఎంపికలను ప్రారంభించారు. రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 9 మంది బాలురు, 5 మంది బాలికలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దూమర్ల నిరంజన్, పెటాటీఎస్ జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌గౌడ్, పీడీలు వేణుగోపాల్, రాంకల్యాణ్‌జీ, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ రాఫే సెంచరీ; పాలమూరు 238 ఆలౌట్

మహబూబ్‌నగర్ క్రీడలు: హెచ్‌సీఏ బీ-డివిజన్ టూ డే లీగ్‌లో జిల్లా జట్టు ఓపెనర్ అబ్దుల్ రాఫే అద్భుతమైన ప్రదర్శన కనబరిచి సెంచరీ చేశాడు. హైదరాబాద్‌లోని ఎస్‌ఆర్-1 క్రికెట్ గ్రౌండ్‌లో మంగళవారం మహబూబ్‌నగర్-బాలాజీ కోల్ట్స్ జట్ల మధ్య టూడే లీగ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 76.5 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో అబ్దుల్ రాఫే బిన్ అబ్దుల్లా 235 బంతుల్లో 23 ఫోర్లతో 144 పరుగులు చేశాడు. బాలాజీ కోల్ట్స్ బౌలర్లు వివేక్ నందు 4, వి.ఆరుష్ చంద్ర 3 వికెట్లు తీశారు. బుధవారం బాలాజీ కోల్ట్స్ జట్టు బ్యాటింగ్ చేయనుంది.

నీటి నిల్వకు అడుగులు

కృష్ణానదిపై ఉన్న పాత వంతెనకు షెట్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు


కృష్ణానదిపై నిజాం కాలంలో నిర్మించిన వంతెన

- రెండు టీఎంసీలు నిలిచే అవకాశం
- ఇప్పటికే కర్ణాటకతో కొనసాగుతున్న చర్చలు
- కృష్ణా, మాగనూర్ రైతులకు పూర్తిస్థాయిలో అందనున్న సాగునీరు

కృష్ణా: మండలంలోని కృష్ణానదిపై ప్రస్తుతం ఉన్న పాత వంతెనకు షెట్టర్లు ఏర్పాటు చేసి రెండు టీఎంసీల నీటినిల్వకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. కొత్త వంతెన వచ్చే ఏడాది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పాత వంతెన నిరుపయోగంగా మారకుండా షెట్టర్లు ఏర్పాటు చేసి నదికి సమాంతరంగా నీటిని నిలిపేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. నీటినిల్వతో పరిసర గ్రామాలకు సాగు, తాగునీటి ఇబ్బందులు ఉండవు. ఇందుకు కర్ణాటక ప్రభుత్వం కూడా అంగీకరించనుందని.. ప్రాజెక్టు విజయవంతమయ్యేందుకు అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికను త్వరలో విడుదల చేయనున్నట్లు సమాచారం. మాగనూర్, కృష్ణా మండలాల్లోని పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించే అవకాశం ఉంటుంది. కృష్ణా మండలంలో 31 వేల ఎకరాల సాగు భూమి ఉండగా.. కేవలం 13 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుంది. మిగతా 18 వేల ఎకరాల్లో రైతులు వర్షాధార పంటలు సాగు చేస్తున్నారు. మాగనూర్ మండలంలో 30 వేల ఎకరాలు ఉండగా.. 18 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇక్కడ పెద్దవాగు తీరంతో పాటు సంగంబండ ప్రాజెక్టు నుంచి అత్యధికంగా సాగునీరు అందుతోంది. మిగిలిన 12 వేల ఎకరాల్లో వర్షధార పంటలు సాగు చేస్తున్నారు.

నిజాం కాలం నాటి వంతెన..

1933లో హైదరాబాద్ నిజాం కాలంలో కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి పునాది వేయగా 1945లో పూర్తయింది. సుమారు 12 ఏళ్ల పాటు నిర్మాణ పనులు కొనసాగాయి.

కృష్ణా జలాల్లో రాష్ట్రవాటా పూర్తిగా వినియోగించుకుంటున్నా.. భీమానది నీటి విషయంలో 5 టీఎంసీలు వృథా అవుతున్నాయి. షెట్టర్లు ఏర్పాటుతో వీటిని కూడా పూర్తిస్థాయిలో ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. జిల్లాలో వరి, పత్తి అత్యధిక దిగుబడి సాధించిన మండలంగా కృష్ణా గుర్తింపు పొందింది. ఇకమీదట సాగు విస్తీర్ణం పెరగడంతో దిగుబడి కూడా ఎక్కువ వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే మండలంలోని చేగుంట, ఐనాపూర్, కున్సీ, ఆలంపల్లి, హిందూపూర్‌లో నల్లరేగడి భూములున్నాయి. ఇక్కడి రైతులు ఎక్కువగా పత్తి సాగు చేస్తుంటారు.

కల సాకారం కానుంది..



ఈ ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు ప్రాజెక్టుగాని, డ్యాంగాని ఏర్పాటు చేయాలని చాలాకాలంగా కోరుతున్నాం. భీమా ప్రాజెక్టుపై చేపడుతామని ప్రజాప్రతినిధులు చెబుతూనే వస్తున్నారు కానీ చేపట్టడం లేదు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రాంత రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని వంతెనకు షెట్టర్లు బిగించి సాగునీటిని అందిస్తామని ప్రకటించడం సంతోషంగా ఉంది.

– సంతోష్, రైతు, గుడెబల్లూర్

వంతెన పనులకు వెళ్లాం..



కృష్ణానదిపై వంతెన నిర్మాణ సమయంలో నా వయస్సు 11 ఏళ్లు. అప్పుడు మా కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు పనులకు వెళ్లేవారు. వారి వెంట నేను కూడా వెళ్లా. నాడు నిర్మించిన వంతెన నేడు మాకు సాగునీరు అందించేందుకు ఉపయోగపడుతుండటం ఆనందంగా ఉంది. ఇప్పుడు నా వయస్సు 91 ఏళ్లు.

– హన్మంతు, గుడెబల్లూర్

రైతుల సంక్షేమమే ధ్యేయం..



కృష్ణానదిపై ఇప్పుడున్న పాత వంతెనకు షెట్టర్లు బిగించి రెండు టీఎంసీల నీటి నిల్వకు నిర్ణయం తీసుకున్నాం. అలాగే భీమానదిపై ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలు నిర్మించి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించబోతున్నాం .ఈ విషయంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాం. నిర్మాణం పూర్తయితే నియోజకవర్గ రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండవు.

– వాకిటి శ్రీహరి, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి

జూరాలకు 36 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 43 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం రాత్రి 7.30 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో 36 వేల క్యూసెక్కులకు తగ్గిందన్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 31,122 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 70 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 600 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2 కు 750 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 33,572 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.690 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

12 యూనిట్లలో 474 మెగావాట్లు

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు.

శ్రీశైలంలో 883.9 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో 883.9 అడుగుల వద్ద 209.5948 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 31,122, సుంకేసుల నుంచి 2,280 మొత్తం 33,402 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం చేరుతోంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 29,931 మొత్తం 65,246 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 6,750, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,835, ఎంజీకేఎల్‌ఐకు 633 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.115 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 15.005 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ప్రాజెక్టు ఒక గేటును 0.50 మీటర్ల మేర తెరిచి 2,280క్యూసెక్కులను దిగువకు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు ఆయన పేర్కొన్నారు.

బాలిక మృతదేహంతో ధర్నా


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: మహబూబ్‌నగర్ జిల్లా రాంరెడ్డిగూడెం గురుకుల కళాశాలలో చదువుతున్న విద్యార్థిని ప్రియాంక సోమవారం ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు మంగళవారం మండల కేంద్రంలోని అయిజ-గద్వాల ప్రధాన రహదారిపై గంటపాటు రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని నచ్చజెప్పేందుకు యత్నించినా ఒప్పుకోలేదు. తమ కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని, మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించే వరకు విరమించే ప్రసక్తే లేదని భీష్మించుకు కూర్చున్నారు. ఆందోళన తో వాహనాలు అక్కడికక్కడ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యులు, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. న్యాయం జరిగేలా చూస్తానని భరోసానివ్వడంతో ఆందోళన విరమించారు. డీఎస్పీ మొగులయ్య, సీఐ టంగుటూరి శ్రీను, ఎస్‌ఐలు, పోలీసులు ఉన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 31 వరకు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి వెల్లడించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కుమారలింగంపల్లిలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 18 వరకు ఉపన్యాసాలు, భజనలు, కుంకుమ పూజా కార్యక్రమాలు ఉంటాయని, ఈనెల 21 నుంచి 25 వరకు జిల్లాలోని దేవరకద్ర మండలం అజిలాపురంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉపన్యాసాలు, భజనలు, కుంకుమపూజ, ఈనెల 31, 31 తేదీల్లో గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మండలం రామాపురంలోని చెన్నకేశవస్వామి దేవాలయంలో ఉపన్యాసాలు, భజనలు, కుంకుమపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ వారి సేవకులు కేశవు లు, పాండురంగం, సురేష్‌చందర్ దూత్, హనుమంతురెడ్డి, పల్లాటి తారకం, రాములు, ఏనుగొండ నర్సింలు, బాల్‌రెడ్డి, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలు

మహబూబ్‌నగర్ క్రైం: ఈ నెల 21న పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జానకి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ సేవలు- త్యాగాలు ప్రజా రక్షణపై ఫొటోగ్రఫీ పోటీలు ఉంటాయని, ప్రతిఒక్కరూ మూడు ఫొటోలు పంపాలన్నారు. షార్ట్‌ఫిలీం పోలీస్ సేవలు, కర్తవ్య నిబద్ధత- సమాజ రక్షణ అనే అంశంపై ఈ నెల 23 వరకు పంపించాలన్నారు. మీ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌లలో మీ పూర్తి వివరాలతో ఫొటోలు, షార్ట్‌ఫిలిం వీడియోలు పంపాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన మూడు ఉత్తమ ఫొటోలు, షార్ట్‌ఫిలింలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని, జిల్లాలోని విద్యార్థులు, యువత ప్రతిఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు.

అనన్యశ్రీని అభినందించిన సీఎం


అనన్యశ్రీని సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: అంతర్జాతీయ వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న మక్తల్‌కు చెందిన జాతీయ వాలీబాల్ క్రీడాకారిణి పి.అనన్యశ్రీని మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో అనన్యశ్రీ, ఆమె తల్లిదండ్రులు సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. అనన్యశ్రీ సీనియర్ నేషనల్‌లో సాధించిన బంగారు పతకం, ఎఫ్ఐఎస్‌యూ వరల్డ్ యూనివర్సిటీ, ఇతర స్థాయిల్లో సాధించిన మెడల్స్‌ను సీఎంకు చూపించారు. ఈ సందర్భంగా అనన్యశ్రీని సీఎం అభినందించి శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌తోపాటు పి.ఆనంద్, వరలక్ష్మి, ఆదిత్య శౌర్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల డేగ కన్నుల్లో నల్లమల

- ప్రధాని పర్యటన నేపథ్యంలో విస్తృత తనిఖీలు
- శ్రీశైలం పరిసర ప్రాంతాలను జల్లెడ పడుతున్న స్పెషల్ పార్టీ పోలీసులు
- గురువారం మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ ఆంక్షలు


శ్రీశైలం పరిసర ప్రాంతాలను జల్లెడ పడుతున్న స్పెషల్ పార్టీ పోలీసులు

దోమలపెంట: శ్రీశైలంలో మల్లికార్జునస్వామి, అమ్మవార్ల దర్శనానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం పోలీసులు మంగళవారం నుంచే సరిహద్దు ప్రాంతాలు లింగాలగట్టు, సున్నిపెంట, శ్రీశైలంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆయా ప్రాంతాల్లో వ్యాపార సంస్థలు ఇతరత్రా అన్నింటిని మూయించారు. దీంతో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రధాని శ్రీశైలం పర్యటనలో ఉన్నప్పుడు తెలంగాణ ప్రాంతం నుంచి శ్రీశైలానికి వచ్చే వాహనాలన్నింటినీ దోమలపెంట, ఈగలపెంటలోని జెన్‌కో గ్రౌండ్‌లో నిలిపివేయనున్నారు. ఈ మేరకు ట్రాఫిక్ ఆంక్షల ఉత్తర్వులు పోలీస్ ఉన్నతాధికారుల నుంచి అందినట్లు ఈగలపెంట ఎస్‌ఐ జయన్న తెలిపారు. ఇదిలా ఉండగా నల్లమల ప్రాంతం అంతా పోలీసుల డేగ కన్నుల్లో ఉంది. మరో పక్కన శ్రీశైలం పరిసర ప్రాంతాలన్నింటిని స్పెషల్ పార్టీ పోలీసులు జల్లెడ వేస్తున్నారు. ఇప్పటికే ఎస్ఎస్‌జీ దళాలు శ్రీశైలానికి చేరుకున్నాయి. శ్రీశైలం పరిసర ప్రాంతాలు హైఅలర్ట్‌లో ఉన్నాయి. గురువారం ఆర్టీసీ బస్సులను సైతం ఈగలపెంటలో ఆపివేయనున్నారు. శ్రీశైలంలో ప్రధాని పర్యటన అనంతరం ఆర్టీసీ సర్వీసులు, ఇతర వాహనాల రాకపోకలకు అనుమతిస్తారు. గురువారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

3 ఎకరాలు.. 3 బస్తాలు



మండల కేంద్రానికి చెందిన రైతు సీమ వెంకటయ్య ఎకరాకు రూ.6 వేల చొప్పున మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని రూ.95 వేల పెట్టుబడితో పత్తి సాగు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎదుగుదల లేక చెట్టుకు ఒకటి, రెండు కాయలు వచ్చాయి. వారం కిందట 8 మంది కూలీలతో పత్తి తీయించగా.. మూడు బస్తాల్లో 85 కిలోలు చేతికందింది. దీనిని మార్కెట్‌లో విక్రయించగా.. కమీషన్, హమాలీ ఖర్చులు పోను కేవలం రూ.5,190 వచ్చాయి. కూలీలు ఒక్కొక్కరికి రూ.350 చొప్పున రూ.2,800.. కూలీల ఆటో అద్దె రూ.600 పోను అతడికి మిగిలింది రూ.1,790 మాత్రమే.

– మరికల్

చెరుకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా చెరుకు సంఘం అధ్యక్షుడు రాజన్న

ఎర్రవల్లి: చెరుకు రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి జిల్లా చెరుకు సంఘం అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని జింకలపల్లి స్టేజీ వద్ద శాంతినగర్ జోన్ చెరుకు సంఘం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న కొత్తకోట మండలంలోని అమడబాకుల రైతువేదికలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కృష్ణవేణి చెరుకు రైతు సంఘం జనరల్ బాడీ సమావేశం ఉంటుందన్నారు. అందులో చెరుకు రైతుల సమస్యల పరిష్కారం, వారి అభివృద్ధి కోసం అందరితో చర్చించి పలు నిర్ణయాలతో కూడిన వినతిపత్రాన్ని కృష్ణవేణి చెరుకు పరిశ్రమ యాజమాన్యానికి సంఘం తరఫున అందజేస్తామన్నారు. కార్యక్రమంలో చెరుకు సంఘం నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, నారాయణ, చంద్రసేనారెడ్డి, వెంకటేష్‌గౌడ్, షాలిమియ్య, వీరన్న, వెంకటేష్, రామకృష్ణ, అశోక్‌రెడ్డి, అన్నారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, మదుసూదన్‌రెడ్డి, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

సాగర్ వెనుక జలాల్లో యువకుడు గల్లంతు

చందంపేట: నల్లగొండ జిల్లా నేరెడుగొమ్ము మండలంలోని వైజాక్ కాలనీ వద్ద సాగర్ వెనుక జలాల్లో మంగళవారం యువకుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన తిన్నారపు పృథ్వీరాజ్(26) హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. మంగళవారం తన నలుగురు స్నేహితులతో కలిసి వైజాక్ కాలనీకి వచ్చాడు. ఈ క్రమంలో పృథ్వీరాజ్ ఈత కొట్టేందుకు సాగర్ వెనుక జలాల్లోకి దిగి గల్లంతయ్యాడు. అతడి స్నేహితులు గమనించి స్థానికులకు విషయం చెప్పగా గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రాత్రి వరకు గాలించినా పృథ్వీరాజ్ ఆచూకీ తెలియరాలేదని ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపారు.

ఇసుక డంప్ సీజ్

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాలు.. గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టగా గ్రామం నుంచి నౌరోజీ క్యాంపునకు వెళ్లే మార్గంలోని పెద్దవాగు వద్ద 60 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను గుర్తించి సీజ్ చేశామన్నారు. తుంగభద్ర నది నుంచి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా అనుమతులు లేకుండా తరలించి డంప్ చేశారన్నారు. ఆర్ఐ చంద్రకాంత్ ఆధ్వ ర్యంలో తనిఖీ చేసి ఇసుక సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. డంప్ ఎవరు చేశారనే వివరాలు తెలియాల్సి ఉందన్నారు.



కబడ్డీలో ప్రతిభ





మహబూబాబాద్‌లో సోమవారం ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్రస్థాయి కబడ్డీ చాంపియన్‌సిప్‌లో ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచాయి. ఈ పోటీల్లో బాలికలు ప్రథమ స్థానంలో, బాలుర జట్టు ద్వితీయస్థానంలో నిలిచి సత్తాచాటాయి. ఈ సందర్భంగా డీఐఈఓ కౌసర్ జహాన్, మహబూబ్‌నగర్ జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి జట్టు సభ్యులను అభినందించారు.

– మహబూబ్‌నగర్ క్రీడలు



శ్రీలంక-న్యూజిలాండ్ మ్యాచ్ వర్షార్పణం

కొలంబో: మహిళల వన్డే ప్రపంచకప్‌లో మరో పోరు వర్షార్పణమైంది. కొలంబోలో నిరంతరాయంగా కురుస్తున్న వానలతో రెండోసారి శ్రీలంక ఖాతాలో ఫలితం తేలని మ్యాచ్ చేరింది. మంగళవారం న్యూజిలాండ్, శ్రీలంక మధ్య జరిగిన లీగ్ మ్యాచ్‌ను ఒక ఇన్నింగ్స్ తర్వాత భారీ వర్షం కారణంగా రద్దు చేయాల్సి వచ్చింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. నీలాక్షిక సిల్వ (28 బంతుల్లో 55 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), చమరి అటపట్టు (72 బంతుల్లో 53; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా... హాసిని పెరీరా (44),విష్మి గుణరత్నే (42) రాణించారు. కివీస్ బౌలర్లలో సోఫీ డివైన్ 3, బ్రీ ఇల్లింగ్ 2 వికెట్లు పడగొట్టారు. అయితే లంక బ్యాటింగ్ ముగిసిన తర్వాత మొదలైన వర్షం ఆ తర్వాత కొంచెం కూడా తెరిపిని వ్వలేదు. దాంతో న్యూజిలాండ్‌కు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. చివరకు అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 4న కొలంబోలోనే శ్రీలంక, ఆస్ట్రేలియా జట్ల మధ్య మ్యాచ్ కూడా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. కొలంబోలోనే నేడు జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో ఇంగ్లండ్ ఆడుతుంది.

‘ప్రపంచకప్ టోర్నీకి చాలా సమయం ఉంది’



- రోహిత్, కోహ్లి భవిష్యత్తుపై గంభీర్ వ్యాఖ్య
- రాబోయే సిరీస్‌పైనే దృష్టి పెట్టామన్న హెడ్ కోచ్


న్యూఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 19 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది. సిరీస్ ఫలితంకంటే విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల గురించే ఇప్పుడు చర్చ జరుగుతోంది. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత మళ్లీ ఈ సిరీస్‌తోనే బరిలోకి దిగుతున్న వీరిద్దరు ఇప్పటికే రెండు ఫార్మాట్‌ల నుంచి రిటైర్ అయి ఒక్క వన్డేలే ఆడుతున్నారు. ఈ క్రమంలో రోహిత్‌ను వన్డే కెప్టెన్సీ నుంచి కూడా తప్పించారు. ఈనేపథ్యంలో తాజా చర్చపై భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఇప్పటికిప్పుడు వారిద్దరి భవిష్యత్తుపై తానేమీ చెప్పలేనని స్పష్టం చేశాడు. ‘వన్డే వరల్డ్‌కప్‌కు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. కాబట్టి భవిష్యత్తుకంటే ప్రస్తుతంపైనే దృష్టి పెట్టడం ముఖ్యమని నేను భావిస్తా. వారిద్దరు అత్యుత్తమ ఆటగాళ్లు అనడంలో సందేహం లేదు. పునరాగమనం చేస్తున్న వారి అనుభవం ఆస్ట్రేలియాలో పనికొస్తుంది. వీరిద్దరు బాగా ఆడి సిరీస్ విజయంలో భాగమవుతారని ఆశిస్తున్నా’ అని గంభీర్ చెప్పాడు.

గిల్‌కు కెప్టెన్సీ అర్హత ఉంది...

భారత టెస్టు కెప్టెన్సీతో పాటు వన్డేలకు కూడా సారథ్యం వహించే సత్తా, అర్హత శుబ్‌మన్ గిల్‌కు ఉన్నాయని, ఈ హక్కును అతను సాధించుకున్నాడని గంభీర్ ప్రశంసించాడు. ‘కెప్టెన్‌గా గిల్‌ను నియమించి ఎవరూ ఔదార్యం చూపించలేదు. అతడికి ఆ అర్హత ఉంది. కోచ్‌గా కూడా నేను ఈ మాట చెప్పగలను. ప్రపంచ క్రికెట్‌లో అతి కఠినమైన పర్యటనల్లో ఇంగ్లండ్ ఒకటి. అలాంటి చోట ఐదు టెస్టులూ గట్టిగా నిలబడి సిరీస్‌ను సమం చేసుకోగలగడం చిన్న విషయం కాదు. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాటు జట్టును సమర్థంగా నడిపి వన్డేల్లోనూ సారథి కాగల హక్కును అతను సాధించాడు’ అని గంభీర్ అన్నాడు. 2027 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ గురించి ఇప్పుడే మాట్లాడటం అనవసరమని, వరుసగా విజయాలు సాధించడమే తమ లక్ష్యమని అతను స్పష్టం చేశాడు. భారత జట్టు నవంబర్ 9న ఆస్ట్రేలియాతో చివరి టెస్టు ఆడనుండగా... నవంబర్ 14 నుంచి కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు జరుగుతుంది. అయితే ప్రొఫెషనల్ క్రికెటర్లు తక్కువ సమయంలో పరిస్థితులకు తగినట్లుగా మార్చుకోగలరని విశ్వాసం వ్యక్తం చేసిన గంభీర్... టెస్టు టీమ్‌లో మాత్రమే సభ్యులైన ఆటగాళ్లు రంజీ ట్రోఫీలో బరిలోకి దిగాలని సూచించాడు. వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ గెలవడం పట్ల కోచ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. అయితే భారత్‌లో కూడా పేస్ బౌలర్లకు కూడా కాస్త అనుకూలించే విధంగా బౌన్సీ పిచ్‌లు ఉంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

హర్షిత్ రాణాపై అనవసర విమర్శలు...

భారత జట్టు తరఫున మూడు ఫార్మాట్‌లలోనూ వరుసగా అవకాశాలు పొందుతున్న పేస్ బౌలర్ హర్షిత్ రాణాపై ఇటీవల సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రతిభావంతుడు కాకపోయినా... ఢిల్లీకి చెందినవాడు కావడంతో పాటు గంభీర్ ఐపీఎల్ టీమ్ కేకేఆర్‌కు మెంటార్‌గా ఉన్న సమయంలో సాన్నిహిత్యం వల్లే రాణాకు జట్టులో చోటు దక్కుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ కూడా ఇటీవల ఇదే మాట అన్నాడు. తాజా విమర్శలపై గంభీర్ తీవ్రంగా స్పందించాడు. ఈ వివాదంలో హర్షిత్‌కు అతను పూర్తి మద్దతు పలికాడు. ‘యూట్యూబ్‌లో వ్యూస్ కోసం కొందరు ఒక 23 ఏళ్ల యువ ఆటగాడిని లక్ష్యంగా చేసుకున్నందుకు సిగ్గుపడాలి. రాణా తండ్రి మాజీ క్రికెటర్ కాదు. సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ కానీ ఎన్ఆర్ఐ కానీ కాదు. అతను తన ప్రతిభను నమ్ముకొనే క్రికెట్ ఆడుతున్నాడు. ఒక ఆటగాడి ప్రదర్శన బాగా లేకుండా విమర్శించవచ్చు కానీ ఇలా వ్యక్తిగత విమర్శలు చేస్తారా. కావాలంటే నన్ను విమర్శించండి. నేను దానిని భరించగలను. కానీ 23 ఏళ్ల ఆటగాడిపై ఇది మానసికంగా ఎలాంటి ప్రభావం చూపిస్తుందో ఆలోచించారా. భారత క్రికెట్ జట్టు ఎవరిదో సొంత ఆస్తి కాదు. మన జట్టు గెలవాలని భావించే అందరిది ఈ జట్టు అని మర్చిపోవద్దు’ అని గంభీర్ వ్యాఖ్యానించాడు.



లాంఛనం ముగిసింది

రెండో టెస్టులో 7 వికెట్లతో భారత్ జయభేరి

వెస్టిండీస్‌పై 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ ● కేఎల్ రాహుల్ అర్ధశతకం

న్యూఢిల్లీ: వెస్టిండీస్ మూడో **రోజు ఫాలోఆన్‌లో** రెండో ఇన్నింగ్స్‌తో మొదలుపెట్టిన **పోరాటం** నాలుగో రోజూ కొనసాగడం... **ఇద్దరి సెంచరీల** మైలురాయితో ఆతిథ్య భారత్ **ముందు లక్ష్యాన్ని** ఉంచడంతో ఈ చివరి టెస్టు **చివరి రోజుదాకా** సాగింది. మంగళవారం ఆటలో **భారత్ సులువైన** లక్ష్య ఛేదనలో మిగిలిపోయిన **లాంఛనాన్ని తొలి** సెషన్‌లోనే పూర్తి చేసింది. అలా **రెండో టెస్టులో** టీమిండియా 7 వికెట్ల తేడాతో **వెస్టిండీస్‌పై ఘనవి** జయం సాధించింది. భారత్ **రెండో ఇన్నింగ్స్‌లో** 35.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి **124 పరుగులు చేసి** గెలిచింది. ఓవర్‌నైట్ బ్యాటర్ **కేఎల్ రాహుల్ (108** బంతుల్లో 58 నాటౌట్; 6 ఫోర్లు, **2 సిక్స్‌లు) అర్ధ** శతకం సాధించాడు. రోస్టన్ చేజ్ **2 వికెట్లు తీయగా...** వారికెన్‌కు ఒక వికెట్ దక్కింది. **రవీంద్ర జడేజాకు** ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ లభించింది. **రెండు టెస్టుల్లో** ఆడిన ఒకే ఇన్నింగ్స్‌తో శతక్కొట్టిన **జడేజా 8 వికెట్లు** కూడా తీశాడు. కాగా ఈ రెండో **టెస్టులో 8 వికెట్లు** (5/82, 3/104) పడగొట్టిన **కుల్దీప్ యాదవ్‌కు** ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కింది.

గంటసేపు పైగా...

ఆఖరి రోజు మిగిలిపోయిన 58 పరుగులు చేసేందుకు 63/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ కాసేపటికే సాయి సుదర్శన్ (76 బంతుల్లో 39; 5 ఫోర్లు) వికెట్‌ను కోల్పోయింది. ఓవర్‌నైట్ బ్యాటర్ రాహుల్‌కు జతయిన కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (13) కూడా వికెట్‌ను సమర్పించుకోవడంతో లాంఛనం పూర్తి చేసేందుకు భారత్ గంటసేపు పైగానే ఆడాల్సి వచ్చింది. క్రీజులోకి ధ్రువ్ జురేల్ (6 నాటౌట్; 1 ఫోర్) రాగా... 102 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న రాహుల్ అజేయంగా నిలిచి భారత్‌ను గెలిపించాడు. **కేఎల్ రాహుల్ తొలి టెస్టులో శతకంతో కదంతొక్కాడు. ఈ క్లీన్‌స్వీప్** విజయంతో టీమిండియా ‘ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్’ పాయింట్ల పట్టికలో 61.9 శాతంతో మూడో స్థానాన్ని పటిష్టం చేసుకుంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్డ్; వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 248; వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: 390; భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) ఫిలిప్ (బి) వారికెన్ 8; రాహుల్ (నాటౌట్) 58; సాయి సుదర్శన్ (సి) షై హోప్ (బి) చేజ్ 39; గిల్ (సి) గ్రీవ్స్ (బి) చేజ్ 13; ధ్రువ్ జురేల్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 0; మొత్తం (35.2 ఓవర్లలో 3 వికెట్లకు) 124. వికెట్ల పతనం: 1-9, 2-88, 3-108. బౌలింగ్: సీల్స్ 3-0-14-0, వారికెన్ 15.2-4-39-1, పియర్ 8-0-35-0, చేజ్ 9-2-36-2.

10 వెస్టిండీస్‌పై భారత్ వరుస సిరీస్ విజయాల సంఖ్య. దక్షిణాఫ్రికా పేరిట ఉన్న ఒకే జట్టుపై వరుస సిరీస్ విజయాల రికార్డును భారత్ సమం చేసింది. దక్షిణాఫ్రికా జట్టు కూడా విండీస్‌పై వరుసగా పది సిరీస్‌లలో గెలిచింది.

14 ఢిల్లీ గడ్డపై టీమిండియా అజేయ రికార్డు. భారత్ 1993 నుంచి ఇక్కడ ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా ఓడలేదు. 12 టెస్టులు గెలువగా, రెండు ‘డ్రా’ అయ్యాయి.

122 సొంతగడ్డపై భారత్ గెలిచిన టెస్టులు. సంప్రదాయ క్రికెట్ చరిత్రలోనే ఇది మూడో అత్యధికం. ఆస్ట్రేలియా (262), ఇంగ్లండ్ (241) మాత్రమే ముందున్నాయి.

భారత్-పాకిస్తాన్ హాకీ మ్యాచ్ ‘డ్రా’



జొహోర్ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ అండర్-21 అంతర్జాతీయ జూనియర్ హాకీ టోర్నీలో భారత్ ఖాతాలో తొలి ‘డ్రా’ చేరింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో మంగళవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌ను భారత జట్టు 3-3 గోల్స్‌తో ‘డ్రా’గా ముగించింది. భారత్ తరఫున అరిజీత్ సింగ్ (43వ నిమిషంలో), ఆనంద్ (47వ నిమిషంలో), మన్‌మీత్ (53వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ తరఫున హన్నాన్ షాహిద్ (5వ నిమిషంలో) ఒక గోల్.. సుఫియాన్ ఖాన్ (39వ, 55వ నిమిషంలో) రెండు గోల్స్ చేశాడు. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ ఏడు పాయింట్లతో ఆస్ట్రేలియాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

ఆసియా కప్ ఆశలు గల్లంతు

సింగపూర్ చేతిలో ఓడిన భారత్


మార్గావ్: ఆసియా కప్-2027 ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత సాధించడంలో భారత్ విఫలమైంది. క్వాలిఫికేషన్ టోర్నీలో రెండో పరాజయంతో జట్టు నిష్క్రమణ ఖాయమైంది. మంగళవారం జరిగిన గ్రూప్ ‘సి’ మ్యాచ్‌లో సింగపూర్ 2-1 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. సింగపూర్ తరఫున సంగ్ యు యంగ్ 44వ, 58వ నిమిషాల్లో గోల్స్ నమోదు చేశాడు. భారత్ తరఫున లాలియన్‌జుల చాంగ్తే 14వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. గ్రూప్ ‘సి’లో టీమిండియా చివరి స్థానంలో ఉంది. గ్రూప్ విజేత మాత్రమే ఆసియా కప్‌కు అర్హత సాధిస్తుంది.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

అందుకు తెగించే ఇక్కడ ఉన్నాను



- సిద్ధు జొన్నలగడ్డ

‘‘నేను ఏ సినిమా చేసినా నాపై నాకే ఎక్స్‌పెక్టేషన్స్ ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడే డీటీఎస్‌లో ‘తెలుసు కదా’ సినిమా చూశాను. చాలా ఎగ్జైట్ అయ్యాను. ఇదే ఎగ్జైట్ మెంట్‌ని ఆడియన్స్ కూడా ఫీలవుతారని అనుకుంటున్నా’’ అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం ‘తెలుసు కదా’. ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించారు. నీరజా కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో సిద్ధు జొన్నలగడ్డ చెప్పిన విశేషాలు.

● ‘తెలుసు కదా’లో నేను వరుణ్ పాత్రలో కనిపిస్తాను. స్క్రీన్‌పై వరుణ్ మామూలుగా కనిపిస్తున్నప్పటికీ అతని ఆలోచనలు చాలా ర్యాడికల్‌గా ఉంటాయి. ఈ క్యారెక్టరైజేషన్ చూసి, ఆడియన్స్ షాక్ అవుతారనుకుంటున్నాను. ఫస్టాఫ్‌లో శ్రీనిధి, సెకండాఫ్‌లో రాశీ క్యారెక్టర్స్ బలంగా కనిపిస్తాయి. వీరిద్దరి కంటే వరుణ్ రోల్ ఇంకా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ● కొత్తవాళ్లతో వర్క్ చేయడం రిస్క్‌తో కూడుకున్న పనే. కానీ రిస్క్ ఉన్న చోటే రివార్డు కూడా ఉంటుంది. నీరజగారి ఐడియాలు బాగున్నాయి. కాకపోతే హీరో క్యారెక్టరైజేషన్‌ను కాస్త ఇంప్రూవ్ చేసిన తర్వాత షూటింగ్‌కు వెళ్లాం. డబ్బుల గురించి ఆలోచించకుండా మంచి సినిమా తీయమని ప్రోత్సహించే నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌గారు. అందుకే విజువల్‌గా ‘తెలుసు కదా’ స్క్రీన్‌పై పెద్ద సినిమాలా కనిపిస్తుంది. ● సినిమా మేకింగ్‌లో జోక్యం చేసుకుంటున్నానంటే నా కోసం ఎవరూ కథలు రాయలేదు. నా కథలు నేనే రాసుకున్నాను. ఫిల్మ్ మేకింగ్ గురించిన ప్రతి విషయాన్ని నేర్చుకున్నాను. ఒకవేళ సినిమా హిట్టయితే డైరెక్షన్, మ్యూజిక్, సినిమాటోగ్రఫీ, హీరో హీరోయిన్ల యాక్టింగ్... ఇలా అన్నీ బాగున్నాయి అంటారు. అదే ఫ్లాప్ అయితే నేను ఇన్‌వాల్వ్ అయ్యాను కాబట్టి పోయిందని నిందిస్తారు. ఇందుకు తెగించే ఇక్కడ ఉన్నాను. ● నేను హీరోగా నటించిన ‘డీజే టిల్లు, డీజే టిల్లు 2’ సినిమాలు సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. ఈ డీజే టిల్లు క్యారెక్టరైజేషన్ ‘హై’ వల్ల నా సినిమాలు ఒకట్రెండు ఫలితాలు తారుమారు కావొచ్చని ముందే ఊహించాను. ‘జాక్’ సినిమా ఆడియన్స్‌ను మెప్పించలేకపోయింది. అప్పుడు కొరటాల శివగారు ఫోన్ చేసి, ‘డీజే టిల్లు’ హిట్స్‌తో ఆల్ టైమ్ ‘హై’ చూశావ్... ‘జాక్’తో ‘లో’ చూశావ్. ఇక నువ్వేం చేసినా ఆ రెండింటి మధ్య చూస్తావు’’ అన్నారు. ఆ మాటలు నాలో కొత్త ఆలోచనలు కలిగించాయి. ● ఇటీవల ఓ ఇబ్బందికర ప్రశ్న ఎదుర్కొన్నాను. సినిమాల్లో హీరో పోలీసాఫీసర్ అయితే రియల్‌గానూ పోలీస్‌గా ఉంటారా? హీరో డ్రగ్ ఎడిక్ట్ అయితే రియల్ లైఫ్‌లోనూ డ్రగ్ ఎడిక్టై ఉంటారా? అది సినిమా. హీరో ఆన్సర్ చేసే పొజిషన్‌లో ఉన్నాడు కదా అని ఏది పడితే అది అడిగేయడం కరెక్ట్ కాదు. ● ‘తెలుసు కదా’ ప్రమోషన్స్‌లో భాగంగా రవితేజగారి బయోపిక్ చేయాలని ఉందని చెప్పాను... చూడాలి. ఇక నాకు డైరెక్టర్‌గా మారే ఆలోచన కూడా ఉంది. హీరోగా నా తర్వాతి సినిమా ‘బ్యాడాస్’ కొత్తగా ఉంటుంది. మల్లిక్ రామ్‌తో ఓ సినిమా చేయాల్సి ఉంది.

ఫ్లాష్‌బ్యాక్‌లో యాక్షన్



● ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘ఎన్టీఆర్ నీల్’ (వర్కింగ్ టైటిల్). ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్ కోసం ఎన్టీఆర్ ఓ డిఫరెంట్ లుక్‌లోకి మారారని టాక్. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు సినిమాలో హైలెట్‌గా నిలవనున్నాయట. ఇదిలా ఉంటే... ఈ సినిమాకి ‘డ్రాగన్’ అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఫిల్మ్ నగర్ టాక్. ఈ చిత్రం 2026 జూన్ 25న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

‘వార్ 2’ రికార్డ్ : హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ ముఖ్య తారలుగా నటించిన చిత్రం ‘వార్ 2’. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదలైంది. ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ఈ నెల 6 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అత్యధిక మంది వీక్షించిన చిత్రాల జాబితాలో ‘వార్ 2’ చిత్రం టాప్‌లో ఉన్నట్లు ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ తెలిపింది. ఈ నెల 6 నుంచి 12 వరకూ 3.5 మిలియన్ల మంది వీక్షించినట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీంతో గత వారం ఇండియాలోనే ఎక్కువ మంది చూసిన సినిమాగా ‘వార్ 2’ నిలిచింది.

కుందేలుకి కోపం వస్తే..!



● చిరంజీవి, నయనతార

‘‘మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... పొద్దునలేచిన దగ్గర్నుంచి డైలీ యుద్ధాలా... మొగుడు పెళ్లాలంటే కంకీ కొడవల్లా... అట్ట కన్నెర చెయ్యాలా... కారాలే నూరేలా...’’ అంటూ సాగుతుంది ‘మీసాల పిల్లా...’ పాట. చిరంజీవి హీరోగా నటిస్తున్న ‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమాలోనిది ఈ పాట. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో చిరంజీవి, నయనతార భార్యా భర్తలుగా కనిపిస్తారు. ఈ సినిమాలోని ‘మీసాల పిల్లా...’ పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా ఉదిత్ నారాయణ్ ఆలపించారు. ‘‘ఇట్ట దుమ్మెత్తి పొయ్యాలా దూరాలె పెంచేలా... కుందేలుకి కోపం వస్తే చిరుతకు చెమటలు పట్టేలా...’ అంటూ ఈ పాట సాగుతుంది. అర్చన సమర్పణలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమా వచ్చే సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది.

కబడ్డీ... కబడ్డీ



● ధ్రువ్

ప్రముఖ తమిళ హీరో విక్రమ్ తనయుడు ధ్రువ్ హీరోగా అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘బైసన్’. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. పా. రంజిత్ సమర్పణలో నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్‌పై సమీర్ నాయర్, దీపక్ సెగల్, పా. రంజిత్, అదితీ ఆనంద్ నిర్మించిన ఈ చిత్రం తమిళంలో ఈ నెల 17న విడుదల కానుంది. తెలుగులో జగదాంబే ఫిలిమ్స్ పై బాలాజీ ఈ నెల 24న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రానా రిలీజ్ చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ- ‘‘1990 బ్యాక్‌డ్రాప్‌లో కబడ్డీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ‘బైసన్’. ట్రైలర్ ఎంత ఆసక్తికరంగా ఉందో సినిమా కూడా థ్రిల్లింగ్ అంశాలతో అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ సినిమాలకు తెలుగులో మంచి ఆదరణ దక్కుతుంది. కబడ్డీ నేపథ్యంలో రాబోతున్న మా సినిమా కూడా మంచి విజయం అందుకుంటుందని నమ్ముతున్నాను’’ అన్నారు.

ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు

- నిర్మాత రాజేశ్ దండ

‘‘నిర్మాతగా ‘కె-ర్యాంప్’ నాకు ఆరవ సినిమా. నా గత ఐదు చిత్రాల్లో ఎక్కడా ఇబ్బందికరమైన పదాలు లేవు. ఒక్కో సినిమా కథ ఒక్కోలా ఉంటుంది. అంతే కానీ కావాలని కొన్ని పదాలు పెట్టి, ప్రేక్షకులను థియేటర్స్‌కు రప్పించాలని అనుకోను. అలాంటి సినిమాలు నేను తీయను. ‘కె-ర్యాంప్’ చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు’’ అని చెప్పారు నిర్మాత రాజేశ్ దండ. కిరణ్ అబ్బవరం, యుక్తీ తరేజా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘కె-ర్యాంప్’. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాజేశ్ దండ మాట్లాడుతూ- ‘‘ఈ చిత్రంలో కిరణ్‌గారు కుమార్ అబ్బవరం అనే పాత్రలో నటించారు. ఈ సినిమా కథ విని ఎగ్జైట్ అయ్యాను. మా సినిమాకు సెన్సార్ వాళ్ళు ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చింది ఇందులో ఇబ్బందికరమైన పదాలు ఉన్నాయని కాదు. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వీటిని చూసి ఎవరైనా ఆడియన్స్ ప్రేరణ పొందుతారేమోనని ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చారు... అంతే. వల్గారిటీ లేదు. ఇక ‘కె-ర్యాంప్’ సినిమా కిరణ్‌గారి వన్ మ్యాన్ షోలా ఉంటుంది. ఇంట్రవెల్ బ్యాంగ్ బ్లాస్ట్ అవుతుంది. ఈ సినిమాతో నిర్మాత శివతో నాకు మంచి ప్రయాణం మొదలైంది. నా మీద నమ్మకంతో కథ వినకుండానే ఈ సినిమాలో భాగమయ్యారు శివ. ప్రస్తుతం మా బ్యానర్‌లో హీరోయిన్ సంయుక్తతో ఓ సినిమా చేస్తున్నాం. అలాగే ‘అల్లరి’ నరేశ్‌గారితో ఓ సినిమా ఉంది’’ అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ- ‘‘టార్గెటెడ్ ట్రోలింగ్ గురించి బన్నీ వాసుగారు మాట్లాడిన విషయాలను నేను ఫాలో కాలేదు. పూర్తి విషయాలు తెలిసిన తర్వాత స్పందిస్తాను’’ అని చెప్పారు. ‘‘కిరణ్‌గారిని ఈ సినిమాలో కొత్తగా చూస్తారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా ఉంటుంది’’ అన్నారు శివ బొమ్మకు.



● రాజేశ్ దండ, శివ బొమ్మకు

అరి కథతో పుస్తకం తీసుకొస్తున్నాం

- జయశంకర్

‘‘అరిషడ్వర్గాల గురించి ఎంతోమంది గొప్పవాళ్లు చెబుతూ వచ్చారు. కానీ, వాటికి పరిష్కారం చూపించలేదు. ఈ ఆలోచనతోనే ‘అరి’ చిత్రాన్ని రూపొందించాను. ఈ సినిమా కథతో త్వరలోనే పుస్తకాన్ని తీసుకొస్తున్నాం’’ అని దర్శకుడు జయశంకర్ చెప్పారు. వినోద్ వర్మ, అనసూయ, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘అరి’. రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మించారు. ఏషియన్-సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10న విడుదలైంది. ఈ సినిమా సక్సెస్ మీట్‌లో జయశంకర్ మాట్లాడుతూ- ‘‘మా సినిమాకి స్లోగా ఓపెనింగ్స్ వచ్చి పికప్ అవుతుందనుకున్నాం. అయితే శ్రీకాంత్ అయ్యంగార్ ఇష్యూ వల్ల రెండో రోజునే మా సినిమా పోస్టర్స్‌ను థియేటర్స్ దగ్గర చించివేయడం బాధగా అనిపించింది. ఆ తర్వాత ఆ వివాదం సద్దుమణిగింది. మూడో రోజు నుంచి మా సినిమాకి ప్రేక్షకుల సందడి కనిపించింది’’ అని పేర్కొన్నారు. ‘‘పేపర్ బాయ్’లో అవకాశం ఇచ్చి, నాకు గుర్తింపు తీసుకొచ్చిన జయశంకర్‌గారు ఇప్పుడు ‘అరి’లో లీడ్ రోల్ ఇచ్చి మరింత గుర్తింపు తెచ్చుకునేలా చేసినందుకు థ్యాంక్స్’’ అని నటుడు వినోద్ వర్మ తెలిపారు.



● వినోద్ వర్మ, జయశంకర్

సస్పెన్స్ సీమంతం



● సుధాకర్, ఆర్పీ పట్నాయక్

‘‘ప్రస్తుతం సమాజంలో నెలకొన్న ఓ ప్రధానమైన సమస్య నేపథ్యంలో రూపొందిన ‘సీమంతం’ సినిమా మంచి విజయం సాధించాలి. ‘ఎద మాటున...’ పాట బాగుంది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి’’ అని సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ తెలిపారు. వజ్రయోగి, శ్రేయ భర్తీ జంటగా సుధాకర్ పాణి దర్శకత్వం వహించిన చిత్రం ‘సీమంతం’. ప్రశాంత్ టాటా నిర్మించిన ఈ సినిమా నవంబరు 14న విడుదల కానుంది. ఎస్. సుహాస్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ‘ఎద మాటున...’ అంటూ సాగే పాటని ఆర్పీ పట్నాయక్ రిలీజ్ చేశారు. ‘‘సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ‘సీమంతం’. గర్భవతులపై దాడుల నేపథ్యంలో కథ సాగుతుంది’’ అని యూనిట్ పేర్కొంది.